టికెట్ రావడంతో..మిన్నంటిన సంబురాలు

విలేకరులతో మాట్లాడుతున్న గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్, బీఆర్ఎస్ నాయకులు

సంబరాల్లో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు

సంబరాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్వ్యాస్ బిలాల్తో బీఆర్ఎస్ నాయకులు

తల్లి వద్దకు వెళ్లి మొదట ఆశీర్వాదం తీసుకున్న వ్యాస్

అబిడ్స్, నవంబర్ 7 : గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను పార్టీ అధిష్టాన వర్గం ప్రకటించడంతో సంబురాలు అంబరాన్ని అంటాయి. గోషామహల్‌లోని ఆయన కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చి పెద్ద ఎత్తున పటాకులుపేల్చడంతో పాటు నృత్యాలు చేశారు. మహిళ నాయకురాలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. రంగులు చల్లుకుంటూ ఒకరికి ఒకరు అభినందనలు తెలుపుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ గోషామహల్‌లో తన తల్లి వద్దకు వెళ్లి మొదట ఆశీర్వాదం తీసుకున్న తర్వాత నియోజకవర్గంలోని వ్యాపార వేత్తలు వివిధ కుల సంఘాల నాయకులను వ్యక్తిగతంగా కలిసి వారి ఆశీర్వాదం తీసుకొని మద్దతు తెలిపాలని కోరారు.

వ్యాస్‌కు అభినందన వెల్లువ..

గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నంద కిశోర్ వ్యాస్ బిలాల్‌కు పార్టీ నాయకులు అభినందనలతో ముంచెత్తారు. గోషామహల్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు వ్యాస్‌ను కలిసి పుష్పమాలతో ముంచెత్తారు. మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, పార్టీ నాయకులు శీలం సరస్వతి, ఎస్. ధన్‌రాజ్, పి. అనిత, శశిరాజ్ సింగ్, నాగమణి, శంకర్‌సింగ్ జమేదార్, పాటు పలువురు నాయకులు నందకిశోర్ వ్యాస్‌కు మిఠాయిలు తినిపించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఒకేరోజు రెండు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు

ఉస్మానియా వైద్యుల ఘనత

సుల్తాన్‌బజార్, నవంబర్ 7: ఉస్మానియా దవాఖానలో ఒకేరోజు రెండు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. మరోసారి ఉస్మానియా దవాఖాన ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసిన వైద్యులకు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉస్మానియా దవాఖానలో యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 2న ఒకేరోజు నల్గొండ జిల్లా తేరట్‌పల్లికి చెందిన 52 ఏండ్ల కట్టా భాగ్యమ్మ, హఫీజ్‌బాబానగర్‌కు చెందిన 37 ఏండ్ల అప్సు రూహీలకు విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహించారు. ప్రస్తుతం ఇద్దరు మహిళలు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. ఈ సందర్భంగా మంగళవారం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ మాట్లాడుతూ.. ఎంతో సంక్లిష్టమైన రెండు శస్త్ర చికిత్సలను ఒకేరోజు నిర్వహించి, సంతృప్తికరమైన ఫలితాలను సాధించిన యూరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా విభాగాల వైద్యులు, వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

జూబ్లీహిల్స్, నవంబర్7: విద్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 8 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలు 9 వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ప్రారంభం అవుతాయన్నారు. ఆంగ్ల-1, ఆర్థిక శాస్త్రం-1 విభాగాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. బోధనా సమయాన్ని బట్టి వేతనం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులకు పీజీలో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులుండాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ రెండు లేనిపక్షంలో రెండవ ప్రాధాన్యతగా పీజీ అభ్యర్థులను ఎంపికచేస్తామన్నారు. బోధాననుభవం కలిగిన వారికి వెయిటేజీ ఇస్తారని.. వీరు తమ సర్వీస్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్వాన్ ఎంఐఎం అభ్యర్థి కౌసర్ మొహినుద్దీన్‌ను మొఘల్ నగర్‌లో సన్మానించిన కార్వాన్ రజక సంఘం నాయకులు - కార్వాన్, నవంబర్ 7

ఆనంద్‌కుమార్ గౌడ్‌కు అభినందనల వెల్లువ

నాంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్‌కుమార్ గౌడ్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు సంజయ్

అబిడ్స్, నవంబర్ 7 : నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్‌ను పార్టీ అధిష్టాన వర్గం ప్రకటించడంతో నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు తరలి వచ్చి పెద్ద ఎత్తున పటాకులు కాల్చారు. సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్‌కు మిఠాయిలు తినిపించి సంబురాలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు కార్యాలయానికి విచ్చేసి ఆనంద్‌కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని వ్యాపార వేత్తలు వివిధ కుల సంఘాల నాయకులను వ్యక్తిగతంగా కలిసి వారి ఆశీర్వాదం తీసుకొని మద్దతు తెలిపాలని కోరారు. పార్టీ నాయకులు ప్రదీప్ అగర్వాల్, గంజి రజని, మెట్టు నటరాజ్ తదితరులు ఆనంద్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపడుతున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో ఇంటింటా తిరిగి వారికి వివరించి వారి సహకారంతో ఘన విజయం సాధిస్తామన్నారు. తనకు టికెట్ కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరిని ఏక త్రాటిపైకి తీసుకు వచ్చి వారి సహకారంతో పార్టీ విజయం సాధించేందుకు పాటు పడ్తామన్నారు.

నాంపల్లి బీఆర్ఎస్ కార్యాలయం వద్ద సంబురాలు

మెహిదీపట్నం నవంబర్ 7 : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి నాంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు.మంగళవారం సాయంత్రం నాంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నబత్తి లక్ష్మీనారాయణ,ప్రదీప్‌కుమార్ అగర్వాల్,నరేందర్ పాల్గొన్నారు.



నాంపల్లి బీఆర్ఎస్ కార్యాలయం వద్ద సంబురాల్లో నాయకులు

గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి బీ - ఫారం అందించిన సందర్భంగా ప్రగతి భవన్‌లో రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్ కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించేందుకు కలిసి మెలిసి పని చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లి ప్రజల మద్దతు కూడగట్టి వారి సహకారంతో విజయం సాధించాలని అశీష్‌కుమార్ యాదవ్‌కు తెలిపారు. **- అబిడ్స్, నవంబర్ 7**

బీజేపీ పాలనలో తీవ్ర ఇక్కట్లు

ఆ ప్రాంతంలో ప్రతి రెండు వారాలకు ఒకసారి డ్రైనేజీ పొంగి పొర్లుతున్నది. కార్పొరేటర్, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. గోషామహల్ నియోజకవర్గం, బేగంబజార్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్‌షాహి ప్రాంతం, మాజీ మంత్రి గడ్డం రామస్వామి ఇంటివెనుక భాగంలోని ప్రాంతంలో డ్రైనేజీ పొంగి పొర్లడం నిత్య కృత్యమైంది. ఈ విషయమై బీజేపీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.ఆరు నెలల క్రితం సీవరేజీ బోర్డు అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తానని చెప్పినా నేటికి ఏ పరిష్కారం కాలేదని వాపోయారు. ఈ ఎన్నికల్లో తమ ప్రాంతానికి వచ్చే బీజేపీ నాయకులను నిలదీస్తామని వారన్నారు. బీజేపీ పాలకులు కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. **- సుల్తాన్ బజార్, నవంబర్ 7**